www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023

చెస్ టోర్నమెంట్ విజేత భగదీశ్వర్‌రెడ్డి

కడప : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలో చెస్ ఆఫ్ హాల్లో నిర్వహించిన 15వ అశ్రఫ్ - ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ విజేతగా కమలాపురానికి చెందిన రేటెడ్ చెస్ క్రీడాకారుడు భగదీశ్వర్‌రెడ్డి నిలిచాడు. ఐదు రౌండ్లకు గాను ఐదు పాయింట్లు సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. వెయ్యి రూపాయలు నగదు బహుమతిని, రోలింగ్ ట్రోఫీని అం దుకున్నాడు. కడపకు చెందిన మరో రేటెడ్ చెస్ క్రీడాకారుడు శ్రీకాంత్ 5 రౌండ్లకు గాను ఐదు పాయింట్లు సాధించి టై బ్రేక్ స్కోరులో రెండవ స్థానం దక్కించుకున్నాడు. మూడవ స్థానంలో ప్రభుదేవా నిలిచారు. విజేతలకు ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ జి విశ్వనాథ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

విజేతను అభినందిస్తున్న నిర్వాహకులు

సైకిల్ సత్తా చాటేనా!

జిల్లాలో టిడిపి బలోపేతంపై టిడిపి అధ్యక్షులు చంద్రబాబు దృష్టి సారించారు. రాయలసీమ కూడలియైన కడప పట్టణంలో సీమ లోని 35 అసెంబ్లీ ఇన్‌ఛార్జులు, ఇతర ముఖ్యనేతలతో జోన్-5 రివ్యూ సమావేశం పేరిట కసరత్తు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా జోన్ల వారీగా రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో చేదు ఫలితాలు ఎదురైన నేపథ్యంలో రాయలసీమలో పునర్వైభవాన్ని చాటుకునేందుకు కసరత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. జోన్-5 రివ్యూ సమావేశానికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులతోపాటు కీలక నేతలూ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.ఈనేపథ్యంలో జిల్లా నాయకత్వం టిడిపి అధినేత పర్యటనను జయప్రదం చేయడంపై దృష్టి సారించింది.

కడపలో జోన్-5 సమీక్ష సమావేశం
35 అసెంబ్లీ ఇన్‌ఛార్జులు, నేతల హాజరు
నేడు జిల్లాకు చంద్రబాబు రాక

సమీక్ష సమావేశానికి సిద్ధమవుతున్న ప్రాంగణం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని పుత్తా ఎస్టేట్‌లో జోన్-5 రివ్యూ సమావేశ నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇందులోభాగంగా టిడిపి అధ్యక్షులు చంద్రబాబు మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 5.30 గంటల వరకు సీమలోని కడప, నంద్యాల, కర్నూలు, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ స్థానాల పరిధిలోని 35 అసెంబ్లీ ఇన్‌ఛార్జులు, ఇతర ముఖ్య నేతలతో ముఖాముఖి సమావేశం కానున్నారు. ఈమేరకు టిడిపి జిల్లా నాయకత్వం అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది.2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాను వైసిపి క్లీన్‌స్వీప్ చేసింది. ఇదేతరహాలో చిత్తూరు జిల్లాలో కుప్పం, అనంతపురం జిల్లాలో ఉరవకొండ, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిమితమైంది. 2014 సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం కావడంలో భాగంగా టిడిపి జోన్ల వారీగా రివ్యూ సమావేశాల పేరిట సిద్ధమవుతోంది.

రాష్ట్రవ్యాప్త నిరసనలకే పరిమితం

టిడిపి రాష్ట్ర నాయకత్వం బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ వంటి నిరసన కార్యక్రమాల నిర్వహణకే జిల్లా నాయకత్వం పరిమితమైంది. జిల్లాలో వైసిపి నాయకుల కబ్జాలకు, ఇతర అక్రమాలకు, దాడులకు సంబంధించి సొంతంగా కార్యక్రమాలు నిర్వహించలేక పోయింది. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అధికార పార్టీ అక్రమాలను, అన్యాయాలను ఎదురించడంలో జిల్లా నాయకత్వం విఫలమైంది. దీనికితోడు జిల్లా టిడిపికి సమర్థ నాయకత్వం కొరవడింది. బహునాయకత్వం కారణంగా శ్రేణుల్లో స్పష్టత కొరవడిందని చెప్పవచ్చు. కడప జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాల్లో అధికార వైసిపిని ప్రతిపక్ష టిడిపి ముఖాముఖి ఎదుర్కోనుంది. 2009లో వైసిపి ఆవిర్భావం నుంచి అసెంబ్లీ ఎన్నికల పోరులో పోటాపోటీగా పోటీనివ్వడమేగానీ ఆశించిన ఫలితాలను రాబట్టుకోవడంలో విఫలమవుతూనే వస్తోంది. 2009, 2014 అసెంబ్లీ ఎన్ని ల పోరులో రాజంపేట అసెంబ్లీ స్థానంతో టిడిపి సరి పెట్టుకోవాల్సి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసిపి శ్రేణుల దాడుల నేపథ్యంలో టిడిపి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం లోపించింది. టిడిపి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో భాగంగా దాడులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించి టిడిపి అధ్యక్షులు చంద్రబాబు పర్యటించారు. ఆర్థిక, న్యాయపరమైన సహాయం చేస్తామని ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు. ఫలితంగా టిడిపి శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. ఇటీవలి మండలి ఎన్నికల్లో ఆశావహమైన ఫలితాల సాధ నలోనూ విఫలమైంది. పిడిఎఫ్ ఓట్ల సహాయంతో రెండు, మూడు స్థానాల ఓట్లతో గట్టెక్కిన సంగతి తెలిసిందే.

2024లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టిడిపి అధ్యక్షులు కొన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం తెలిసిందే. ఇందులోభాగంగా జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు టికెట్లను దాదాపుగా స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో జిల్లాలో జోన్-5 రివ్యూ సమావేశం నిర్వహించడం ఉత్కంఠను కలిగిస్తోంది. 2004 నుంచి జిల్లాలో వరుస ఓటములు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నాయకత్వం టికెట్ల కేటాయింపుల్లో ప్రజల్లో ఉన్న నాయకులకు టికెట్లు కేటాయిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, రాయచోటి టికెట్ వేటలో పలువురు పోటీపడుతుండడంతో గందరగోళం నెలకొంది. పులివెందుల ఇన్‌ఛార్జిగా బి.టెక్ రవి, జమ్మలమడుగు ఇన్‌ఛార్జిగా భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా ప్రవీణ్‌కు మార్‌రెడ్డి, మైదుకూరు ఇన్‌ఛార్జిగా పుట్టా సుధాకర్‌యాదవ్, బద్వేల్ ఇన్‌ఛార్జిగా డాక్టర్ రాజశేఖర్ ఉన్న సంగతి తెలిసిందే. 2024 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరిలో టికెట్లు ఎవరికి దక్కుతాయోననే ఆందోళన నెలకొంది.

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరి సభలో నాయకులు

ప్రచార భేరి బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - బద్వేలు

కేంద్రంలో ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భారత లౌకిక రాజ్యాంగాన్ని బుట్ట దాఖలు చేసిందని, దానిని కాపాడుకోవాలని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, ఈశ్వరయ్య అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రచార భేరి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి హిందూత్వ ఆర్ఎస్ఎస్ అజెండాను అనధికారికంగా అమలు చేస్తోందని విమర్శించారు. బిజెపిని వదిలించుకోకపోతే దేశ సమైక్యత, సమగ్రత, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోలేమన్నారు. నరేంద్ర మోడీ, అమిత్‌షా, నడ్డా దేశంలోని ఫెడరల్ రాజ్యాంగ సూత్రాలను విస్మరించి ప్రాంతీయ, ప్రతిపక్ష పార్టీలను లేకుండా చేయడానికి ప్రణాళికలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు జి.చంద్రశేఖర్, చంద్ర మాట్లాడుతూ సిఎం కడప జిల్లా వాసైనా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని తెలిపారు. జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామికవాడకు ఒక్క కొత్త పరిశ్రమ రాలేదని, కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు కేంద్రం నుంచి నిధులు రాబట్ట లేకపోయారని, రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించలేకపోయారని, 30 ఏళ్ల గడుస్తున్నా తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ పంట కాల్వలకు నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. సోమశిల బ్యాక్ వాటర్ ఆధారంగా బద్వేల్ పెద్ద చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్, గిద్దలూరు-భాకరాపేట, నెల్లూరు-ఎర్రగుంట్ల రైల్వే లైన్లు ఏర్పాటుకు, ఏ ఒక్కటి కూడా పూర్తి చేయటానికి, నిర్మించడానికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం కేటాయించలేదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు వి.వీరశేఖర్, జకరయ్య, సిపిఎం, సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శులు కె.శ్రీనివాసులు, బాలు, సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి సభ్యులు పి.చాంద్ బాషా, సిపిఎం బద్వేల్ రూరల్ కార్యదర్శి డి.వెంకటేష్, నాయకులు రమణ, మస్తాన్, రాజు, ప్రజలు పాల్గొన్నారు.

కడప అర్బన్ : నరేంద్ర మోడీ బిజెపి పరిపాలనలో ప్రభుత్వ సంస్థలను ధ్వంసం చేసి సంపన్నులకు రాయితీలు ఇచ్చి పేదలపై అనేక భారాలు మోపారని సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు ఎన్. వెంకట శివ, రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్, సంధ్య సర్కిల్ పరిసర ప్రాంతాల్లో మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార బేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, బిజెపి మోడీని సాగనంపుదామని చెప్పారు. కేంద్రంలోని బిజెపి పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీరం చేస్తూ కార్పొరేట్ బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని వాపోయారు.. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి సామాన్యులపై ఎడాపెడా భారాలు మోపుతూ ప్రధాని మోడీ నియంతలా వ్యవహరిస్తున్నారని వ పేర్కొన్నారు. ప్రజల సార్వభౌమాధికారానికి పట్టం కట్టే ఆధునిక రా జ్యాంగానికి భిన్నంగా నిచ్చెన మెట్ల కులాలను వీక్షిస్తున్న మనుధర్మశాస్త్రాన్ని మోడీ ప్రభుత్వం అనుసరిస్తుండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, దస్తగిరి రెడ్డి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీల నాయకులు పి.మలి కార్జున ,బ్రహ్మం ,ఆర్ బాబు, డి ఎం ఓబులేసు, ఫరూక్, శంకర్ నాయక్, రాజామణి, భాగ్యలక్ష్మి, ప్రసాద్ ఆచారి ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాహుల్, శివ నాగేంద్ర,నగర కార్యదర్శి చైతన్య, జోసెఫ్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వ.కా.స నాయకులు, లబ్ధిదారులు

లబ్ధిదారులకు భూమిని అప్పజెప్పాలి

ప్రజాశక్తి - బద్వేల్

బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె, మల్లేపల్లి, పలుగురాళ్ల పల్లె , పాపిరెడ్డిపల్లె, ముడుమాల తదితర రెవెన్యూ గ్రామాల్లో 2006, 2007 సంవత్సరాల్లో అసైన్‌మెంట్ ఆమోదం పొందిన లబ్ధిదారుకలు భూమలు సర్వే చేసి అప్పజెప్పాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివ కుమార్, అన్వేష్, వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం స్థానిక నాలుగు రోడ్లకూడలి నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీగా నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 ఏళ్ల కిందట దళితులకు, పేదలకు అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొంది పట్టాలు మంజూరు చేశారని చెప్పారు. ఇంతవరకూ సర్వే చేసి లబ్ధిదారులకు భూములు చూపకపోవడం దారుణమని వాపోయారు. 10 మంది కలెక్టర్లు, 9 మంది ఆర్‌డిఒలు, 13 మంది తహశీల్దార్లు బదిలీ అయ్యారని అయినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌డిఒ, తహశీల్దార్ స్పందించి భూమిని సర్వే చేసి లబ్ధిదారుకలు అప్పగించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గోవిందు ,రవణమ్మ, సుబ్బమ్మ, మండల కమిటీ నాయకులు సునీల్, అజయ్, రాహుల్, నరసింహ, రాజశేఖర్, 17గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

కడప అర్బన్ : పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం సంస్కృతం పరీక్ష నిర్వహించారు. 4,280 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా పది మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఎనిమిది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది. ఎలాంటి డి బార్లు నమోదు కాలేదు.

నేను ఎవరితోనూ కుమ్మక్కు కాలేదు

సిబిఐ సరైన కోణంలోనే విచారిస్తోంది
విలేకరుల సమావేశంలో డ్రైవర్ దస్తగిరి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మీడియాతో మాట్లాడుతున్న దస్తగిరి

'నేను ఎవరితోనూ కుమ్మక్కై డబ్బులు తీసుకోలేదని' వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన డ్రైవర్ దస్తగిరి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కుమ్మక్కు అయినట్లు నిరూపిస్తే జీవితాంతం జైలుకు వెళ్లడానికి సిద్ధమని, లేనిపక్షంలో మీరు పార్టీని, పదవులను వదలుకుని జైలుకు వెళ్లే శక్తి ఉందా అని సవాల్ విసిరారు. సిబిఐ సరైన కోణంలో వివేకా హత్య కేసును దర్యాప్తు చేస్తోందన్నారు. గతంలో ఉన్న సిబిఐ అధికారి రాంసింగ్, తాజా అధికారి ఇద్దరూ ఒకే దారిలో వెళ్తున్నారంటే నూటికి వెయ్యి పాళు సరైన కోణంలోనే విచారణ సాగుతోందన్నారు. ఎంపీ చెప్పినా, మరొకరు చెప్పినా న్యాయమే గెలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. అప్రూవర్‌గా మారకముందు దస్తగిరి అంటే ఇష్టమని, వాంగ్మూలం ఇచ్చిన అనంతరం చెడ్డవాడు కావడమా అని ప్రశ్నించారు. మీరు చెప్పినట్లే లెటర్ తదితర ప్రాసెస్ సాగించామని తెలిపారు. గతంలో తనకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌లతో ప్రాణహాని ఉందని ఆరోపించానని, తాజాగానూ అదే చెబుతున్నానని తెలిపారు. రెండు నెలలు కంతు కట్టలేదనే నెపంతో తన వాహనాన్ని ఫైనాన్స్ వాళ్లు వేధించడంలోని మతలబు ఏమిటని ప్రశ్నించారు.

కువైట్ నుంచి స్వస్థలానికి చేరిన మహిళ

ప్రజాశక్తి - కడప

స్వస్థలానికి చేరిన మహిళతో సంస్థ ప్రతినిధులు

ఎపి ఎన్ఆర్‌టిఎస్ కువైట్ వారి సహకారంతో అన్నమయ్య జిల్లాకు చెందిన లక్ష్మీదేవి స్వస్థలానికి సురక్షితంగా చేరుకుంది. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం సిఎం రాజపల్లికి చెందిన లక్ష్మి దేవి జీవనో పాధి కోసం 15 నెలల కిందట కువైట్‌కు వెళ్లారు. అక్కడ ఇంట్లో పని చేసేది. స్పాన్సర్ ఆమెను ఇబ్బందులు, చిత్ర హింసలకు గురిచేస్తుండడం, ఇటీవల ఆమె భర్త అనారోగ్యం పాలవడంతో అక్కిడి షేఠ్ ఇంటి నుంచి తప్పించుకుని పోయి భారత రాయబార కార్యాలయ అధికా రులను ఆశ్రయించారు. వారు ఎన్ఆర్‌టిఎస్ రీజనల్ కో- ఆర్డినేటర్ కువైట్ నాయిని మహేశ్వర్‌రెడ్డికి తెలియజేయడంతో వెంటనే స్పందించి ఆమెను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సంస్థలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

మాట్లాడుతున్న పుత్తానరసింహారెడ్డి

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పోలిరెడ్డి వీరకుమార్ రెడ్డి(ఆర్ఎస్ బ్రదర్స్) సోమవారం బాలాజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసిపి టిడిపిలోకి చేరారు. డప్పు వాయిద్యాలతో, మేళ తాళాలతో పంచాయతీ పరిధిలోని తన అనుచరగణంతో దాదాపు 80 కుటుంబాల వారు టిడిపి కండువా కప్పుకొని వైసిపి నుంచి టిడిపిలోకి చేశారు. టిడిపికి ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరామని వారు చెప్పారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సిఎం జగన్మోహన్ రెడ్డి మన జిల్లా వాసి కావడం ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అడగడంతో ఉమ్మడి జిల్లాలో ఆయన్ను నమ్మి గంప గుత్తుగా ఓట్లు వేస్తే ఇటు జిల్లానే కాకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని పేర్కొన్నారు. వైసిపి పాలనలో నాయకులంతా అంతా భూకబ్జాలు, సెటిల్మెంట్లు, ఇసుకను దోచుకొని దాచుకో అని రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు, అందువల్ల నేడు సామాన్య ప్రజల నుంచి మేధావులు విద్యావంతులు తెలుగుదేశం పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు, అసెంబ్లీ ఎలక్షన్లు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పుత్తా చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ టి.వి. కృష్ణారెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి,మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి, సుబ్బ నరసయ్య, కమలాపురం తెలుగు యువత అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కర్నాటి చంద్రఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్ని విపత్తులపై అవగాహన

గ్యాస్ లీకేజీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుబ్బలక్షుమ్మ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అగ్నిమాపక వారోత్సవాల సంద ర్భంగా అగ్ని విపత్తులపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా సహాయ అగ్నిమాపక శాఖ కార్యాలయ అధికారి పి. బసివి రెడ్డి, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా బసివి రెడ్డి మాట్లాడుతూ గృహ నిర్మాణం, కళాశాలలు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణ సమయంలో, విద్యుత్ సరఫరా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వంటింటిలోని సిలిండర్‌ని ఉపయోగించడం, జాగ్రత్తలు, మంటలు ఆర్పడంలో మెలకువలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ జి. విజయలక్ష్మిదేవి, డాక్టర్ పి.శచీ దేవి, శ్రీనివాసులు రెడ్డి, నాగవేణి ,రవిశేఖర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడప : కడప నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి పి. యదుభూషణ రెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్లబ్ లో ఏర్పాటుచేసిన ఈత వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు వారి పిల్లలు, జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎనిమిది సంవత్సరాలు పైబడిన వారందరికీ కూడా ఈతలో శిక్షణ ఇస్తామని తెలిపారు. త్వరలో టెన్నిస్ శిక్షణ శిబిరాన్ని కూడా ప్రారంభించినట్లు చెప్పారు. 9966518830లో సంప్రదించవచ్చునని తెలిపారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి : జెసి

కడప : 'స్పందన' ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను జెసి జి. గణేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారుల విజ్ఞప్తులను సంబంధితాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అనుడ కార్యదర్శి ఆయా శాఖలాధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నదానం చేస్తున్న రాజశేఖర్

ప్రకాష్ నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అనాచి విద్యాలయంలో దేవినేని రాజశేఖర్ ఆరవ వర్ధంతి సందర్భంగా సోమవారం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషావలి మాట్లాడుతూ పేదవారికి సేవ చేయాలన్న తపన కలిగిన వ్యక్తి రాజశేఖర్ అని కొనియాడారు. అలాంటి నాయకుడు చనిపోయి ఆరో ఏడాది పూర్తయిన సందర్భంగా సేవ కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. కార్యక్ర మంలో నరేంద్రనాథ్, శ్యామ్, బద్రి, మునేంద్ర, సత్తి సంజీవ్ పాల్గొన్నారు.

'వెలుగు'లో అవినీతి చీకట్లు

సొమ్ము స్వాహాపై డ్వాక్రా మహిళల ఆందోళన
ఎపిఎంపై పొదుపు సంఘాల ఆరోపణ

సొమ్ము స్వాహాపై ఎపిఎంను ప్రశ్నిస్తున్న పొదుపు సంఘాల మహిళలు

ప్రజాశక్తి-కమలాపురం (వీరపునాయునిపల్లె)

డ్వాక్రా సంఘాల్లోని సభ్యుల జీవనోపాధులను పెంచి వారి కుటుంబ అభివృద్ధి పెంచడం ద్వారా పేదరిక నిర్మూలన సాధించవచ్చనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులను అమలు చేస్తోంది. నెలనెలా పొదుపు చేస్తున్న సొమ్మును వెలుగు శాఖలోని కొందరు స్వాహా చేస్తూ ఎంతో ఘనమైన ప్రభుత్వ లక్ష్యాన్ని నిరుగారుస్తూ, సంఘాల్లో మహిళల జీవితాల్లో చీకట్లు నింపుతున్నారు. వీరపునాయునిపల్లె మండలంలోని సంగాలపల్లె, అడవిచెర్లోపల్లె, పాయసంపల్లె, ఇందుకూరు, సర్వరాజుపేట తదితర గ్రామల్లోని పొదుపు సంఘాలకు చెందిన మహిళలు తీసుకున్న రుణాన్ని ప్రతి నెలా కంతుల వారిగా తిరిగి చెల్లిస్తున్నా ఆ సొమ్మును బ్యాంకులకు కట్టకుండా, రశీదులు ఇవ్వకుండా ఎపిఎం, సిసిలు స్వాహా చేశారని వివిధ సంఘాల మహిళలకు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ఈనెల 14న బాధిత మహిళలు స్త్రీశక్తి ఉపాధి హామీ భవన కార్యాలయంలో ఆందోళన సైతం చేపట్టారు. తాము రుణం తీసుకున్నప్పటి నుంచి ప్రతి నెలా తిరిగి చెల్లిస్తున్నామని,, ఈ విషయం బ్యాంకు అధికారులకు చెబితే 'మీరు ఒక్క రూపాయి కూడా కట్టలేదని , అసలు, వడ్డీ కలిపి రెండింతలయ్యాయని' చెబుతున్నారని వాపోయారు. కచ్చితంగా కట్టాలని బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా జగనన్న ఆసరా పథకం కింద వేసిన సొమ్ము కూడా రుణానికి లింకు పెట్టి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం ఉన్న ఎపిఎం, సిసికి తాము రుణానికి సంబంధించి కంతులు చెల్లించామని, సిసి చనిపోవడంతో తనకు సంబంధం లేదని ఎపిఎం మాట దాట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు తెలుపుతూ వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదని, ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమకు న్యాయం బాధిత మహిళలు కోరుతున్నారు.

మాకు చదువు రాదని.. సొమ్ము వాడుకున్నారు

బ్యాంకులో మేము తీసుకున్న పొదుపు మొత్తాన్ని మా గ్రూపు సభ్యులు చెల్లించాం. ఇప్పుడేమో మేము అసలు డబ్బులు కట్టలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.. మాకు చదువు రాదనే మేము కట్టిన డబ్బులు ఎపిఎం, సిసి సొంత అవసరాలకు వాడుకొని మళ్ళీ మమ్మల్ని డబ్బు కట్టమంటే ఎలా? దీనిపై ఉన్నతాధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.

-లలితమ్మ, శిరీష గ్రూప్, అడవిచెర్లోపల్లి

ప్రతినెలా చెల్లిస్తున్నాం

ప్రతినెలా పొదుపు డబ్బులు తీసుకొచ్చి ఆఫీసులో సిసి మేడమ్ కడుతూ వచ్చేవారం. ఇప్పుడు రుణం చివరి కంతు కట్టడానికి బ్యాంకుకు వెళితే అక్కడ బ్యాంకు వాళ్లు ఇంతవరకు మీరు అసలు పొదుపు డబ్బులే చెలించలేదు. ఇప్పుడు ఈ సొమ్ము తీసుకోం, మొత్తం అసలు వడ్డీ కడితేనే తీసుకుంటాము. లేకపోతే మీపై కేసు పెట్టి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇప్పటికైనా దీనిపై ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలి.

- ఆరోగ్యమ్మ, చెన్నకేశవ స్వామి గ్రూప్, ఇందుకూరు

నాకు ఎలాంటి సంబంధం లేదు

సొమ్ము స్వాహా విషయంలో గతంలో తనపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై పరిశీలించగా అప్పుడు ఉన్నటువంటి సిసి చంద్రనే డబ్బులు వాడుకుటున్న ఒప్పుకుని ఆయన కడుతానని చెప్పారు. కొంత మొత్తం కూడా చెల్లించారు. ఆయన చనిపోయిన తరువాత, సొమ్ము మొత్తం నేనే తీసుకున్నానని పొదుపు మహిళలు చెబుతున్నారు. నాకు ఎటువంటి సంబంధం లేదు.

భాగ్యమ్మ, ఎపిఎం, వీరపునాయునిపల్లి

అనాథ మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

సూర్య డెవలపర్ అధినేత కంచి సురేంద్రనాథ్ (సూరి) జన్మదిన సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు, వైఎస్ జగన్ యువ సేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వ ర్యంలో సోమవారం కడప సబ్ జైల్ సమీపంలో ఉన్న శ్రీ చౌడమ్మ వృద్ధాశ్రమంలో అనాథ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంచి సురేంద్రనాథ్ వ్యాపార రంగంలో దిన దినాభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో రియల్టర్ అరుణ్ ఎం, వి.కృష్ణారెడ్డి, సుబ్బ రాయుడు, రవి, శివశంకర్, రాజారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో రిమ్స్ కళాశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కడప సిటీ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేఖ

వాలీబాల్ పోటీల్లో కడప రిమ్స్ కళా శాల విద్యార్థులు సత్తా చాటారు. ఈనెల 12 నుంచి 16 వరకు నెల్లూరు నారాయణ దంత వైద్య కళాశాలలో నిర్వహించిన వైఎస్ఆర్ యుహెచ్ఎస్ అంతర్ వైద్య కళాశాల క్రీడా పోటీల్లో కడప రిమ్స్ కళాశాల విద్యార్థులు వాలీబాల్ విభాగంలో కాకినాడ రంగ రాయ మెడికల్ కళాశాల విద్యార్థులపై విజయం సాధించి విజేతగా నిలిచారు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో రెండు సెట్లలోనూ 21-25, 23-25 స్కోరుతో ఆధిక్యత పాయింట్లు సాధించి ఘన విజయం సాధించారు. విజేతగా నిలిచిన ప్రణయ్, వంశీ, అమల్, మణికంఠ, తరుణ్, గణేష్ , అంజి టీం మేనేజర్ డాక్టర్ వెంకటమనోజ్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సురేఖ అభినందించి ఇదే స్ఫూర్తితో విద్య, వైద్యంలోనూ చూపించాలని ఆకాక్షించారు. విజేతలను వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సందె పోగు లక్ష్మీబాయి, స్పోర్ట్స్ కమిటీ డాక్టర్ శ్రీనివాస నాయక్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ వినాయక్, డాక్టర్ హరీష్, డాక్టర్ షాహిద్ , ఇతర విభాగాధిపతులు ప్రొఫెసర్లు అభినందించారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేద మహిళలకు సోమవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి చీరలు పంపిణీ చేశారు. స్థానిక బిద్దంలమిట్ట ప్రాంతంలో ఉన్న పేద మహిళలకు టిడిపి మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా రామమునిరెడ్డి మాట్లాడుతూ చీరల పంపిణీ హర్షణీయమన్నారు. తెలంగాణ వలి మాట్లాడుతూ ప్రతి ఏడాది పేద ప్రజలకు దుస్తుల పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆరవి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, డక్కా రమేష్, ఈశ్వరయ్య, వెంకయ్య, వెంకటేశ్వ, పాపిరెడ్డి, మాజీ వార్డు మెంబరు రజాక్, అక్బర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న రామమునిరెడ్డి

రంజాన్ తోఫా అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 200మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. స్థానిక పవర్ హౌస్ రోడ్డులోని స్టార్ ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కొంత మంది వ్యాపారస్తుల సహకారంతో 14 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో టూ టౌన్ సిఐ ఇబ్రహీం, ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, సభ్యులు ఆర్.వి.చలపతి, సమీర్, వీరేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

బాలగంగిరెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొటంగురువాయిపల్లెలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన ఆర్‌ఇఎస్‌ఎస్‌వి జూనియర్ కళాశాల ఉద్యోగి అయిన ములపాక బాలగంగిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా బాటసారులకు దాహం తీర్చేందుకు ఏర్పాటు చేశామని కుటుంబ సభ్యులు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, మురళీరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపడుతామని వారు తెలిపారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - చాపాడు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 6వ తరగతి విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కెజిబివి ప్రత్యేక అధికారి నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం ప్రారంభమైందన్నారు. ఈనెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని నాగలక్ష్మి కోరారు. మరిన్ని వివరాలకు పాఠశాల సిబ్బందిని కలవవచ్చునని సూచించారు.

నేటి నుంచి అయ్యవారిపల్లెలో ఆధార్ క్యాంపు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో మంగళవారం నుండి మూడు రోజులపాటు ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు తెలిపారు. 2010-2016 సంవత్సరాల మధ్య ఆధార్ తీయించుకున్న ప్రతి ఒక్కరూ ప్రస్తుత అప్డేట్ చేయించుకోవాలన్నారు. వయసు, పేరు, చిరునామా వంటి మార్పుల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన కోరారు.

టిడిపి కార్యాలయం ధ్వంసం

- ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు గ్రామంలో టిడిపి కార్యాలయాన్ని ఆదివారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తన శ్రేణులతో సోమవారం సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. సంఘటనకు సంబంధించి వైసిపికి చెందిన హరినారాయణతోపాటు మరికొందరు ఉన్నారని ఆయన తాళ్ల ప్రొద్దుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొండాపురం సిఐ సుదర్శన ప్రసాద్, ఎస్‌ఐ రవిశంకర్‌లను కోరారు. తాళ్లప్రొద్దుటూరుకు చెందిన టిడిపి కార్యకర్త బి.చంద్రశేఖర్‌రెడ్డి కొంతకాలంగా వైసిపి నాయకులు, కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు చేస్తున్నారని, ఆదివారం రాత్రి వైసిపి శ్రేణులు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఇరుపార్టీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. తాళ్లప్రొద్దుటూరు పునరావాస కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి టిడిపి తన కార్యాలయాన్ని నిర్మించిందని వైసిపి నాయకుడు హరినారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలో అనేక ప్రజావసరాల కోసం ప్రభుత్వ స్థలం కావలసి ఉండగా టిడిపి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని ఆరోపించారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : సిఐ

గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగేలా కొందరు నాయకులు అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, కవ్వింపు చర్యలకు పాల్పడేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ సుదర్శన ప్రసాద్ హెచ్చరించారు. గ్రామాల్లో కొందరు స్వార్థ రాజకీయాల కోసం అనవసరమైన వ్యాఖ్యలు చేసి వివాదాలకు కారణమవుతున్నారని, ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని హౌసింగ్ జగనన్న కాలనీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును మున్సిపల్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఏవైనా సమస్యలున్నాయా అని సచివాలయం ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు.

పనులను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

నేటి నుంచి పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

- రోజూ విశేష పూజలు, వాహన సేవలు.. 24న వైద్యనాథేశ్వర స్వామికి కల్యాణం

ప్రజాశక్తి - వల్లూరు

దక్షిణకాశీగా పేరొందిన పుష్పగిరి క్షేత్రంలో హరిహరుల బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి వైభవోపేతంగా ప్రారంభం కానున్నాయి. చెన్నకేశవస్వామి ఆలయ అర్చకులు, వైద్యనాథేశ్వర స్వామి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేశారు. ఈ నెల 18 నుంచి 27 గురువారం వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

దక్షిణకాశీగా పుష్పగిరి క్షేత్రం..

మండలంలోని పుష్పగిరి ఆలయం కళారూపాలకు నిలయంగా మారింది. ఆలయంలో ప్రాచీన కట్టడాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా ఆలయ ప్రాంగణంలో శివకేశవులు ఎక్కడ కనిపించని బ్రహ్మ దేవుని విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడి ప్రాంతం పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా శివరాత్రి, కార్తీక మాసం సందరరేగా ఆలయం భక్తులు పర్యాటకులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక్కడ సంతాన మల్లేశ్వరుడు, ఉమా మహేశ్వర, రాజ్యలక్ష్మి, యోగాంజనేయ, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలు ప్రముఖంగా చూడదగ్గ ప్రదేశాలు.

దక్షిణకాశీగా పిలుచుకునే పుష్పగిరి క్షేత్రం (ఇన్‌సెట్‌లో) వైద్యనాథేశ్వరస్వామి మూల విరాట్

కళారూపాలకు నిలయం..

పుష్పగిరి ఆలయం కళా సంపదకు పెట్టింది పేరు. బయట గోడల మీద ఉన్న శిల్ప సంపద అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. వరుస క్రమంలో ఉన్న ఏనుగులు గుర్రాల మీద వీరులు చేసే విన్యాసాలు ఔరా అనిపిస్తాయి. రామాయణ ఘట్టాలతో పాటు నటరాజ నృత్యాన్ని చెక్కిన తీరు గొప్పగా ఉంటుంది. ఈ విశిష్ట శిల్ప కళా సంపదను విహార యాత్రికులు సందర్శిస్తుంటారు.

మరో సరోవరం..

పుష్పగిరిలో ఉన్న సరోవరాన్ని అమృత్ సరోవరంగా అభివర్ణిస్తుంటారు. ఇక్కడికి వచ్చిన యాత్రికులందరూ స్నానాలు చేసే దేవాలయాన్ని దర్శించుకుంటారు పాపాఘ్ని, కుముద్వతి వల్కల మాండవి నదులు పెన్నా నదిలో కలుస్తాయి. దాంతో ఈ ప్రదేశానికి పంచ నది క్షేత్రం అని పేరు వచ్చింది.

పుష్పగిరికి చేరుకోవడం ఇలా..

కడప నుంచి వచ్చే వారు చెన్నూరు, ఉప్పరపల్లి మీదుగా పుష్పగిరి చేరుకోవచ్చు. కాజీపేట నుంచి వచ్చేవారు చింతల మీదుగా వెళ్లం దుకు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. జాతీయ రహదారి-7 ద్వారా వచ్చేవారు అనంతపురం నుంచి తాడిపత్రి వల్లూరు, ఆదిని మ్మాయపల్లి మీదుగా పుష్పగిరి చేరుకోవచ్చు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఇఒ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వేలాదిమంది భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పెన్నా నదిలో దిగేటప్పుడు జాగ్రత్తలు పాటించి ప్రమాదక సూచిక బోర్డులు గుర్తించి స్నానాలు చేయాలన్నారు.

ప్రత్యేక పూజలు, వాహన సేవలు..

18న మంగళవారం ఉదయం వైద్యనాథేశ్వర స్వామికి గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన , రక్షాబంధనం, అంకురార్పణతో స్వామివారికి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, అగ్ని ప్రతిష్టాపన, నవకల్శం స్థాపన, ధ్వజ తంభరోహణ, తీర్థప్రసాదుల వినియోగం, 20న ం తిరుచి వాహనం గణపతి పూజ , రుద్రాభిషేకం, కుంకుమార్చన, నిత్య హోమం బలిదానం ,తీర్థప్రసాద వినియోగాలుంటాయి. 21న సింహ వాహనం, గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, నిత్య హోమం, బలిదానం, తీర్థ ప్రసాద వినియోగం, 22న పురుషాన్ మురుగ వాహనం గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకు మార్చన, తీర్థ ప్రసాదం, 23న అక్షయ తదియ, నంది వాహనం, గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, పుష్పలంకరణ, తీర్థప్రసాదం, 24న సోమవారం గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, నిత్యహోమం, అదే రోజు ఉదయం 10 గంటలకు ముత్యాల తలంబ్రాలతో వైద్యనాధేశ్వర స్వామికి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. 25న మంగళవారం రథోత్సవం, 26న గణపతి పూజ , రుద్రాభిషేకం, కుంకుమార్చన, నిత్య హోం, 27న బుధవారం త్రిశూల, శ్రీ చక్ర స్నానంతో స్వామివారికి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

సిబిఐ విచారణ సవ్యంగా జరగలేదనడం హాస్యాస్పదం

మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాజీమంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సిబిఐ విచారణ సవ్యంగా జరగలేదని ఎమ్మెల్యే రాచమల్లు అనడం హాస్యాస్పదమని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివేకా హత్యకేసులో దర్యాప్తు చేస్తున్న సిబిఐ విచారణలో వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి పాత్ర ఉన్నట్లు తేలిందన్నారు. జగన్మోహన్‌రెడ్డిపై సొంత కుటుంబ సభ్యులకే నమ్మకం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో వైసిపి నేతలేమో జగనన్న నువ్వే మా నమ్మకం.. నువ్వే మా భవిష్యత్ అంటూ స్టిక్కర్లు అంటించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏం జరిగినా నేను ఒకడిని ఉన్నానంటూ స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఉంటారని తెలిపారు. అవినాష్‌రెడ్డి పాత్ర ఉంటే జిల్లాలోని తొమ్మిది మంది ఎమ్మెల్యేలం రాజీనామా చేస్తామని గతంలో రాచమల్లు చెప్పారన్నారు. ఆ మేరకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ముక్తియార్, తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసులు యాదవ్, రాజుపాలెం టిడిపి అధ్యక్షుడు ధనిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, 9వ వార్డు నాగన్న, నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రియల్ ఎస్టేట్ ముసుగులో ప్రభుత్వ భూములు అక్రమించి విక్రయిస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వెంచర్లు వేసి వాటి పక్కనున్న ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆ వెంచర్‌లో కలుపుకొని అదే సర్వేనంబర్‌తో రిజిస్టర్ చేయించి కొనుగోలుదారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రొద్దుటూరులో కొంతకాలంగా ఇలాంటి వ్యవహారం నడుస్తున్నా అధికారులు ఎక్కడా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవన్నారు. స్థలం కొన్నవారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ భూములు ఉన్నచోట 'ఇది ప్రభుత్వ భూమి' అనే సూచిక బోర్డులు పెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా ఏ సర్వేనంబర్ అయినా రిజిస్టర్ చేస్తున్నారన్నారని, నిజానిజాలు పరిశీలించకుండా స్టాంప్‌లు రాసేవారు ఏది చెబితే అది రిజిస్టర్ చేస్తున్నారని ఆరోపించారు. తమ దృష్టికి వచ్చిన వాటిపై వివరాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత కార్యాలయాల ఎదుట బాధితుల పక్షాన ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సత్యనారాయణ కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

దుష్టత్రయ పార్టీల పాలనలో 'సీమ'కు అన్యాయం

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి, టిడిపి, వైసిపి దుష్టత్రయ పార్టీల పాలనలో రాయలసీమకు నవ మోసాలు జరిగినట్లు పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజెపి రాష్ట్రానికి శని గ్రహంలా, టిడిపి, వైసిపి రాహుకేతువుల్లా దాపురించాయని తెలిపారు. రాయలసీమకు సంజీవని లాంటి ప్రత్యేకహోదా అమలు కాలేదన్నారు. రాయలసీమకు బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ అమలుకాలేదన్నారు. కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మించలేదని విమర్శించారు. ఈ దుష్టత్రయ పార్టీలను రాయలసీమ పొలిమేరల వరకు తరిమికొట్టాలని తులసిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

జగన్‌ది రెండు నాలుకల ధోరణి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి జగన్ మాజీ మంత్రి, తన చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య విషయంలో రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నజీర్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వివేకానందరెడ్డి సౌమ్యుడు, ఎవరికీ ఎలాంటి హాని చేయని వ్యక్తి అని రాష్ట్ర ప్రజలకందరికీ తెలుసన్నారు. రాజకీయంగా ఎదగాలని అందరూ కోరుకుంటారు కాని హత్యా రాజకీయాలు తగవన్నారు. ఇంత జరుగుతున్నా జగన్ సొంత మామ కమలాపురం ఎమ్మెల్యే ఏమీ స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉంద న్నారు. పార్టీ పట్టణ అధ్యక్షులు జిలానీబాషా, నాయకులు భాస్కర్, రామాంజనేయులు, హుశేన్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న నజీర్

అల్లాడుపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లి గ్రామంలో సోమవారం రేషన్ సరుకుల పంపిణీ చేపట్టారు. సోమవారం 'ప్రజాశక్తి'లో 'రేషన్ సరుకుల కోసం ఎదురు చూపు' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు రేషన్ సరుకుల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఇంటర్నెట్ సమస్య తలెత్తుతోందని ఆటోలో కాకుండా గ్రామ సచివాలయంలో సరుకులను ఎండియు ఆపరేటర్ పంపిణీ చేశారు. బియ్యం, కంది బేడలు, చెక్కర లబ్ధిదారులకు అందజేశారు. పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల రేషన్ సరుకులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్

నట్టల నివారణతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల

ప్రజాశక్తి - ముద్దనూరు

గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాగించడం శ్రేయస్కరమని మండల పశువైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మండలంలోని కొసినేపల్లి గ్రామంలో సోమవారం డబ్ల్యూడిసి, పిఎంకెఎస్‌వై కింద డబ్ల్యూఎంఎ కడప వారి సౌజన్యంతో శ్రీనివాస ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలు, దూడలు, ఆవులు, గేదెలకు పైపర్ జిన్ నట్టల నివారణ మందు తాపించామన్నారు. ఎదకు రాని పశువులకు మల్టీ మిన్ మాత్రలు, మినరల్ మిక్చర్ పొడిని పంపిణీ చేసినట్లు తెలిపారు. వ్యాధి బారిన పడిన గొర్రెలు, మేకలకు, జలుబు, జ్వరం, దగ్గు రోగాలకు వైద్యం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రాజశేఖర్‌రాజు, టెక్నికల్ ఆఫీసర్ మద్దిలేటి, వాటర్ షెడ్ ఛైర్మన్ తిరుమలరెడ్డి, గోపాలమిత్రులు రామచంద్రారెడ్డి, మేరీ, వీరేంద్ర పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న పశు వైద్య సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి శివ కుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక స్వామి వివేకానంద పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను విద్యార్థులకు ప్రదర్శించారు.

డెమో ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చాపాడు : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు అగ్నిమాపక కేంద్ర అధికారి శివప్ప సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలో భాగంగా బద్వేల్ రోడ్డులోని ఎస్‌వి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు, అధ్యాపక, సిబ్బందికి అవగాహన కల్పించారు. కాలువలు, బావుల్లో ఈతకు వెళ్లినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్, కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఓబులరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

కులమత, పార్టీలకతీతంగా పథకాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కులమతాలకు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అర్హులందరికీ పభుత్వ పథకాలు అందిస్తున్నారని మండల సచివాలయ కన్వీనర్ సుమంత్ యాదవ్ అన్నారు. మండలంలోని మంగపట్నం గ్రామంలో సోమవారం మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి ఆదేశాల మేరకు సుమంత్ యాదవ్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ప్రతి గడపకు తిరిగి కర పత్రాలు పంచుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు బాలిరెడ్డి, బయపురెడ్డి, పుల్లారెడ్డి, పుల్లం నాయుడు, నారాయణస్వామి, బాబు, వెంకటేష్, ఉపేంద్ర, జోసెఫ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గంగాధర, గృహసారథులు, గ్రామ వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - మైలవరం

మండలంలోని నేలనూతల గ్రామంలో గండికోట టన్నల్ వద్దనున్న క్యాంపులో చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకి చెందిన కుశా నాయక్ (30) క్యాంపులో వంట మనిషిగా దాదాపు ఏడాది నుంచి పనిచేస్తూన్నాడు. అతను కొంతకాలంగా వరబీజం నొప్పితో బాధ పడుతున్నట్లు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపం చెంది ఆదివారం రాత్రి ఒంటి గంట సమయంలో క్యాంపు దగ్గరలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. కుషా నాయక్ చిన్నాన్న పంచన్ నాయక్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KADAPA.

I.P.No. 15/2023

Shaik Khader Vali, S/o S.Nagoor Basha, aged 38 years, Muslim, Business, residing at D.No 16/379, Ghouse Nagar, Kadapa City, Y.S.R. District. **...Petitioner/Debtor**

Vs

1. Malle Obula mma W/o krishnaiah, aged about 4S years, resident of Sumitra Nagar, Fire Office Back Side, badvel, Y.S.R. District.
2. Nazeer Ahamed S/o basha, aged about 47 years, resident of Sumitra Nagar, Beside Kiran School, SMR Jewellers, badvel, Y.S.R. District.
3. Dada Peer S/o.Khader Basha aged about 45 years, resident of Opposite to Ali Akbar Dye Machine, Mokshagundam street, Proddutur, Y.S.R. District.
4. Narasimha S/o Raja, aged about 55 years, resident of Narasimha Jewellers, porumallilla road, badvel, Y.S.R. District.
5. Kalyan Chakravarthi S/o Chakravarthy aged about 35 years, D.No 4S/448, Balaji Nagar, kadapa City.
6. Ali Akbar S/o Basha aged about 48 years, resident at D.no S6/223, beside sai baba school, ITI Circle, Kadapa City.
7. Shakira W/o Baba fakruddin aged about 30 years, D.No. 6/401, Ravindra Nagar, Kadapa City.
8. Lakshmi Devi W/o Balu aged about SO years, resident of Sumitra Nagar, Fire Office Back Side, badvel, Y.S.R. District.
9. Poosala Ravanaiah S/o Subbaih aged about SS years, resident of Sumitra Nagar, Fire Office Back Side, badvel, Y.S.R. District.
10. Deepak S/o venkat aged about 30 years, C/o Deepu's Jewellary, Siddavatam Road, Near CSI Church, Badvel, Y.S.R. District.
11. Shaik Habeebullah, S/o Basha aged about 47 years, C/o Masjid Complex, Sameena Travels, badvel, Y.S.R. District.
12. Chennu Praveen Kumar S/o Kumar aged about 35 years, C/o Friends Textile, Near Doodekula Masjid, Badvel, Y.S.R. District.
13. Hari S/o Narasimha aged about 37 years, C/o Honda Show room, Nellore Road, Badvel, Y.S.R. District.
14. Shaik Nayab, S/o Basha aged about 30 years, C/o nayab jewelers, siddavatam road, badvel, y.s.r. district.
15. Syed Rafi S/o Jaffar Hussain aged a bout SO years, C/o Rafi Gold Shop, Masjid Complex, Siddavatam Road, Badvel, Y.S.R. District.

...Respondents/ Creditors

నోటీసు

పై నెంబరు ఐ.పి.లోని పిటిషనర్ పిటిషన్ షెడ్యూలు దాఖలా బాకీలు తీర్చుటకు వీలులేనందున తనను ఇన్‌స్టాలమెంటుగా తీర్మాణించమని కోరి ఐ.పి.దాఖలు చేసి 27/04/2023వ తేదీకి వాయిదా వుంది. ఎవరికైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు నందు ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెయునని ఈ ప్రకట న ద్వారా తెలియజేయడమైనది.

//By Order of Court//
P.IMRAN KHAN
Advocate, KADAPA.

తల్లిదండ్రుల ఆనందమే లక్ష్యం

ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడితే వారి తల్లిదండ్రులు పొందే ఆనందమే తమకు నిజమైన సంతోషమని జాన్స్ హైస్కూల్ కరస్పాండెంట్ అంబవరం రవిశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జాన్సన్ హైస్కూల్‌లో ఆంగ్ల భాషాదినోత్సవాన్ని స్కూల్ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో జాన్ స్కూల్ అంటేనే ఆంగ్ల మాధ్యమానికి ఒక పేరు ఉందన్నారు. దాన్ని కొనసాగించుకుంటూ వస్తున్నామన్నారు. ఆంగ్ల భాష మూలాలను వివరిస్తూ ఆంగ్ల సాహిత్యంలో దాని అభివృద్ధిని ముడిపెడుతూ విద్యార్థులు వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుందన్నారు. స్ట్రక్చర్ గ్రామర్‌పై విద్యార్థులు చాలా అద్భుతంగా ప్రసంగించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - లింగాల

రైతు భరోసా పథకంలో లబ్ధి పొందని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎఒ రమేష్ తెలిపారు. అర్హత ఉండి లబ్ధి పొందని వారు, కొత్తగా పాస్‌పుస్తకం వచ్చినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ఆయా రైతులకు సంబంధించిన వాలంటీర్లు తెలపాలన్నారు. ఇందుకు అవసరమైన భూమి పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్‌ను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో అందజేయాలన్నారు.

మహారాజ రాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

O.S.No. 649/2022

కె.వెంకటసుబ్బయ్య. **...వాది**

Vs

కె.రాజమోహన్. **...ప్రతివాది**

నోటీసు/సమను

పై కేసులో వాది ప్రతివాదిపై ప్రామీసరీ నోటు, తేది: 17.03.2017, 1,50,000 (లక్షా యాభైవేలు) రాబట్టుటకు, పై కోర్టులో O.S.No.649/2022 దావా దాఖలు చేసినందున ప్రతివాది హాజరు నిమిత్తం వాయిదా 21.04.2023వ తారీఖున ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరు కావలెనని, లేనిచో మీ పరోక్షములో కేసు తీర్మానించెదరని ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

//By order of the Court//
B. GURAPPA NAIDU,
Advocate,
KADAPA.

ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా, కడప జిల్లా, కడప టౌన్, రవీంద్రనగర్, డోర్‌నెం.5/1992, నివాసి అయిన సయ్యద్ ఖాదర్ సిరాజుద్దీన్ కుమారుడు, సయ్యద్ సమీర్ మహ్మద్ గారు సివిల్ దావాను, ప్రతివాది అయిన సయ్యద్ సజ్జార్ మహమ్మద్ పైన కడప, రవీంద్రనగర్‌లోని ఇంటి డోర్‌నెం. 5/200, 5/200-1, 5/201-1 పై ఇంజక్షన్ కొరకు దావా వేసివున్నారు. ప్రతివాది, తప్పుడు డా కొమెంట్లుతో అమ్మచూపుతున్నాడు అని తెలిసినది. అట్లు అమ్మినను, కొనినను, చట్టరిత్య చర్యలు తీసుకొనబడును. పై తెలిపిన ఆస్తి పై సివిల్ కేసు రాజశ్రీ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, కడప కోర్టులో O.S.No.254/2023గా ఉంటున్నది. కావున ఎవరైనా పై దావా ఆస్తిని అమ్మిన, కొనిన చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని తెలియజేయడమైనది.

V.SRINIVASA RAO, M.A.,B.L.,
Advocate,
Viswanathapuram, Yerramukkapalli,
KADAPA-516 004.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం. 983/2022
ఓ.ఎస్.నెం. 68/2017

కుండా వెంకటేశ్వర్లు, తండ్రి కె.నడిపి వెంకటపతి @ వెంకటపతి, వయసు 40 సంవత్సరాలు. హిందూ, వ్యవసాయం, డోర్ నెంబర్ .5/142, అలుగూరి- వీధి, వేపరాల- గ్రామం, మైలవరం మండలం, కడప జిల్లా. **...పిటిషనర్/వాది**

వర్సెస్

R11) అలిశెట్టి యశోదమ్మ, భర్త late ఏ. నారాయణ స్వామి లేట్ , వయసు 35 సంవత్సరాలు, హిందూ, గృహిణి.
R12) అలిశెట్టి ధనుష్ , తండ్రి, ఎ నారాయణ స్వామి లేట్, వయసు 4 సంవత్సరాలు, హిందూ, మైనర్, 11 రెస్పాండెంట్, తల్లి గ్రార్డియన్,
పై ఇద్దరి అడ్రస్ డోర్.నెం. 10/44, కొత్తకోట్టాల వీధి, వేపరాల గ్రామం, మైలవరం మండలం, కడప జిల్లా. **...రెస్పాండెంట్స్**

R11 & R12 రెస్పాండెంట్‌లకు నోటీసు

పై నెంబర్ దావా లోని 4వ ప్రతివాది అయిన ఎ.నారాయణస్వామి దావా మధ్య కాలంలో మరణించినందున అతని వారసులైన మిమ్ములను పై నెంబర్ దావా లో 11 మరియు 12 ప్రతివాదులుగా చేర్చవలెనని కోరుచూ పిటిషనర్ / వాది ఐ.ఎ. నెం.983/ 2022, పిటిషన్ దాఖలు చేసి వున్నారు. పై నెంబర్ పిటిషన్‌లో 11 మరియు 12 రెస్పాండెంట్ అయిన మీకు ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టులో 04-05-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరై తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

//By order of the Court//
T. PEERAIAH, B.A.L., B.L.,
Advocate, Proddatur.